క్లుప్తంగా

డ్రైవింగ్ లైసెన్స్‌లు పంపిణీ



డ్రైవింగ్ లైసెన్స్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇటీవల దరఖాస్తుల స్వీకరణ విభాగం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు 100 మందికి లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్‌లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన సమయంలో లైసెన్స్ లేకపోవడంతో చాలామంది ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి ఉచితంగా లైసెన్స్‌లు జారీ చేయిస్తున్నామని వివరించారు. ఈ అవకాశాన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నీలం లతకు ఎక్సలెన్స్ అవార్డు



అవార్డును అందుకుంటున్న నీలం లత

జిన్నారం(పటాన్‌చెరు): ఎస్వీఆర్ రంగారావు జయంతి సందర్భంగా ఆయా రంగాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నవారిని గురువారం సన్మానించారు. జిన్నారానికి చెందిన నీలం లత సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండటంతో ఎస్వీఆర్ రంగారావు ఎక్సలెన్స్ అవార్డుకు ఎన్నికైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్, సెన్సార్ బోర్డు సభ్యురాలు బేబీ రాణి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా నీలం లత మాట్లాడుతూ తాను చేస్తున్న సేవలను గుర్తించి ఎస్వీఆర్ రంగారావు ఎక్సలెన్స్ అవార్డును అందించటం సంతోషంగా ఉందన్నారు.

'ఖేడ్'లో విపత్తు స్పందన కేంద్రం

నారాయణఖేడ్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నారాయణఖేడ్ తహసీల్దార్ కార్యాలయంలో విపత్తు స్పందన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ మురళీధర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాలతో ఆస్తి, ప్రాణ, పంట నష్టం, శిథిలావస్థకు చేరిన ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉన్నా, చెరువులు, కుంటలు నిండి తెగిపోయే ప్రమాదం ఉన్నా స్పందన కేంద్రానికి 9912392767 నెంబరును సంప్రదించాలని సూచించారు.

పంట పరిహారం చెల్లించాలి

కోహీర్(జహీరాబాద్): భారీ వర్షాలకు నీట మునిగి పంటలకు అపార నష్టం వాటిల్లిందని జెడ్పీటీసీ రాందాస్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని నారింజవాగు పరివాహక ప్రాంతాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దవాగు, నక్కవాగు పరివాహక లోతట్టు ప్రాంతాల్లోని పత్తి, సోయాబీన్, మొక్కజొన్న, కంది, పెసర, మినుము, అల్లం పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అధికారులు నష్టం వివరాలను సేకరించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

వట్‌పల్లి(అందోల్): విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత పడిన ఘటన మండల పరిధిలోని సాయిపేట గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆలురి వీరయ్య తన గేదెను మేపుతున్న క్రమంలో అప్పటికే విద్యుత్ స్తంభాలు నెలకొరిగి తీగలు నేలను తాకుతూ వేలాడుతుండడంతో అక్కడికి వెళ్లిన గేదె విద్యుత్ తీగకు తగిలి అక్కడిక్కడే మృతి చెందింది. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ఆదుకోవాలన్నారు.

బాధితులను ఆదుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

కోహీర్(జహీరాబాద్): మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని మండలంలోని పైడిగుమ్మల్ గ్రామస్తులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గ్రామ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ రెండు నెలలకు పైగా అట్టుడుకుతున్న మణిపూర్‌లో హత్యలు, గృహ దహనాలు, మాన భంగాలకు పాల్పడిన దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

విలీనమైనా.. జాడలేని అభివృద్ధి

జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో విలీనమైన ఐదు గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి జాడ కనబడడంలేదు. సరైన మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీసీ రోడ్లు, మురుగు కాలువలు, తాగు నీరు, వీధిదీపాలు తదితర సమస్యలు వేధిస్తున్నాయి. గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడు ఏదో ఒక అభివృద్ధి పని జరిగేదని, మున్సిపాలిటీలో విలీనమైన తర్వాత ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. – జహీరాబాద్ టౌన్



అనురాగ్ సినిమా హాల్ వద్ద రోడ్డుపై నిలిచిన నీరు



ఆనంద్‌నగర్ కాలనీలో బురదమయంగా రోడ్డు

- మున్సిపాలిటీలో కలిపిన జీపీలపై అలసత్వం
- వసతులపై దృష్టి సారించని అధికారులు
- మౌలిక సౌకర్యాలు లేక ప్రజల ఇక్కట్లు

జహీరాబాద్ పట్టణానికి సమీపంలో రంజోల్, పస్తాపూర్, అల్లీపూర్, చిన్న హైదరాబాద్‌తో పాటు హోతి(కె) పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామ పంచాయతీలను ఐదారు సంవత్సరాల క్రితం మున్సిపాలిటీలో విలీనం చేశారు. అప్పటి నుంచి మున్సిపల్‌కు ఎన్నికలు జరగలేవు. విలీన పంచాయతీలకు పాలకమండలి లేదు. దీంతో గ్రామాల ప్రగతి గురించి పట్టించుకొనే వారు కరువైయ్యారు గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడే అభివృద్ధి జరిగిందని, మున్సిపల్ అధికారులు కన్నెత్తి కూడా చూడడంలేదని విమర్శలు వస్తున్నాయి.

సమస్యలకు నిలయాలుగా కాలనీలు

విలీనమైన పంచాయతీలలో ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నచందంలా అభివృద్ధి తయారైంది. ఆయా పంచాయతీ పరిధిలోని కొత్త కాలనీలు జహీరాబాద్ టౌన్‌లో పూర్తిగా కలిసిపోయాయి. కొత్త కాలనీలో కూడా ప్రగతి పడకేసింది. పస్తాపూర్ పంచాయతీ పరిధిలో మహీంద్ర కాలనీ, ఆనంద్‌నగర్, వసుంధర కాలనీ, టీచర్ కాలనీలు, చిన్నహైదరాబాద్ పంచాయతీలో రాంనగర్, గాంధీనగర్, అల్లీపూర్ పంచాయతీలోని అల్లీపూర్, ఎన్‌జీవోస్, విద్యుత్, క్రిస్టియన్, వెంకటరమణ నగర్, నారాయణనగర్ కాలనీలు టౌన్‌లో కలిసిపోయాయి. రంజోల్, హోతి(కె) గ్రామ పంచాయతీ పరిధిలోని పలు కాలనీలు కూడా పట్టణంలో అంతరభాగమైయ్యాయి. పట్టణంలోని కలిసిన కాలనీలలో రోడ్లు పూర్తిగా దెబ్బతిని ఆధ్వాన్నంగా తయారైయ్యాయి. కొద్దిపాటి వర్షానికి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. గత వారం రోజుల నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విలీన పంచాయతీ పరిధిలోని కొత్త కాలనీలలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కాలినడక కూడా కష్టమే



కాలనీలో గుంతలమయంగా మారిన రోడ్లపై వర్షం నీరు చేరడంతో నడుచుకుంటూ వెళ్లలేకపోతున్నాం. మున్సిపాలిటీకి కోట్ల రుపాయలు మంజూరైనట్లు అధికారులు చెబుతున్నా కనీస సౌకర్యాలు కల్పించడంలేదు. అధికారులు స్పందించి ఆనంద్‌నగర్ కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలి.

– గోపాల్‌రెడ్డి, ఆనంద్ నగర్ కాలనీ, పస్తాపూర్

అభివృద్ధిపై దృష్టి సారించాం



మున్సిపల్‌లో విలీనమైన గ్రామ పంచాయతీ పరిధిలోకి వచ్చే కాలనీలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇప్పటికే దృష్టి సారించాం. అవసరం ఉన్న చోట సీసీ రోడ్లు, మురుగు కాలువలను నిర్మిస్తున్నాం. మరి కొన్నింటికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం.

– మల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్

సీఎం, హోంమంత్రి రాజీనామా చేయాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

నారాయణఖేడ్: మణిపూర్‌లో మహిళలపై జరిగిన అమానవీయ ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో పాటు మణిపూర్ సీఎం నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాష్‌రాథోడ్ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలతో పాటు లంబాడాలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలని వ్యాఖ్యానించిన బీజేపీ ఎంపీ సోయం బాబురావును వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సంఘం ఆధ్వర్యంలో ఖేడ్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం ఆయా డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ కొమురయ్యకు అందజేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ సురేష్, ఖేడ్ నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్‌నాయక్, వినోద్‌నాయక్, నాయకులు రవి, ప్రతాప్, వంశీ, రాజు, శ్రీరాం, శంకర్‌నాయక్, ప్రేమ్ పాల్గొన్నారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో మొహర్రం పండగ వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమైయ్యాయి. ఐదారు రోజుల పాటు కొనసాగే మొహర్రం పండగను ఈ ప్రాంతంలో ప్రజలు కుల, మతాలకు అతీతంగా ఘనంగా జరుపుకుంటారు. మొగుడంపల్లి మండలంలోని ఇప్పెపల్లి గ్రామంలో సిద్దు పాషా, మౌలాలి, హుస్సేన్ భాష, నాలాజర్ పీర్లను ప్రతిష్ఠించగా రెండు రోజుల నుంచి వాటిని ఊరేగిస్తున్నారు. సర్పంచ్ బేగరి సురేష్ పీర్ల ఊరేగింపులో పాల్గొన్నారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా డప్పు చప్పుళ్లతో యువకులు, పిల్లలు ఊరేగింపులో పాల్గొన్నారు.


కాలుష్య జలాల ప్రవాహం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని మెట్రోకెమ్ పరిశ్రమ ఆవరణలో వర్షం నీరు నిల్వ ఉంది. గురువారం ఈ నీటిని బయటకు పంపేందుకు యాజమాన్యం ప్రహరీకి రంధ్రం చేయించారు. కాలుష్య జలాలు కలిసిన నీటిని బయటకు వదిలేస్తుండటంతో సమీపంలోని చెరువులు, కుంటలు కాలుష్యంగా మారుతున్నాయి. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో వర్షాన్ని ఆసరా చేసుకొని పలు పరిశ్రమలు ఇలాంటి అక్రమ చర్యలకు పాల్పడుతున్నాయి.



వర్షం నీటితో కలిసి బయటకు వస్తున్న కాలుష్య జలాలు

ప్రమాదపుటంచున రాసోల్ బ్రిడ్జి



కూలేందుకు సిద్ధంగా ఉన్న రాసోల్ బ్రిడ్జి

- భయాందోళనలో ప్రజలు
- మరమ్మతులు చేపట్టాలని స్థానికుల వేడుకోలు

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని ముర్కుంజాల్ సాములవాగు ప్రాజెక్టుపై రాసోల్, ముర్కుంజాల్ గ్రామాల మధ్య ఉన్న వంతెనపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వంతెనకు ఒకవైపు రాతితో నిర్మించిన గోడ సగం వరకు కూలడంతో బీటలు వారింది. దీంతో ఏ క్షణాన కూలుతుందోనని రాసోల్ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ప్రమాదం జరగకముందే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బీమా చెక్కు అందజేత

రాయికోడ్(అందోల్): మండల కేంద్రానికి చెందిన ఈరన్న ఇటీవల మృతి చెందాడు. ఈరన్న గతంలోనే స్థానిక ఏపీజీవీబీలో ఖాతాదారుడిగా ఉండి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకంలో ఇన్సురెన్స్ తీసుకున్నాడు. దీంతో రూ.2లక్షల బీమా మంజూరైన బీమా డబ్బును చెక్కు రూపంలో ఈరన్న కుటుంబ సభ్యులకు గురువారం బ్యాంకు అధికారులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు సుబ్బారావు, సురేంద్ర, ప్రశాంత్, కరీమ్, సమంత్, సంతోష్, కిష్టారెడ్డి పాల్గొన్నారు.

◆ బియ్యం పంపిణీ

హత్నూర(సంగారెడ్డి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో హత్నూర మండల కేంద్రంలో 15 ఇళ్లు కూలిపోవడంతో బాధితులకు సహాయం చేయాలని ఇటీవల తహసీల్దార్ పద్మావతికి సర్పంచ్ వీరస్వామిగౌడ్ వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. దీంతో వెంటనే స్పందించిన తహసీల్దార్ పద్మావతి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబాలకు బియ్యాన్ని పంపిణీ చేసేవిధంగా చర్యలు తీసుకోవడంతో గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వీరస్వామి గౌడ్ బాధితులకు బియ్యం పంపిణీ చేశారు. దీంతో సర్పంచ్ కృషిని గ్రామస్తులు కొనియాడారు.

◆ పంటల పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి, కొత్తపల్లి, గుమ్మడిదల గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలను వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట సాగులో ఎలాంటి సందేహాలున్నా సంప్రదించాలని అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు.

◆ కమలాపూర్ చెరువు పరిశీలన

నారాయణఖేడ్: మనూరు మండల పరిధిలోని కమలాపూర్ చెరువును గురువారం ఖేడ్ మున్సిపల్ చైర్మన్ రుబీనానజీబ్, శానిటరీ అధికారి శ్రీనివాస్‌తో కలిసి పనులు పరిశీలించారు.

జహీరాబాద్ టౌన్: మండల కేంద్రమైన మునిపల్లిలోని పెద్దచెరువును గురువారం తహసీల్దార్, ఎంపీడీఓ, ఇరిగేషన్ ఏఈ, ప్రజాప్రతినిధులు చెరువును పరిశీలించారు. చెరువులోకి భారీగా వరద నీరు చేరడంతో గండి పడే ప్రమాదం ఉండగా అధికారులు తూమును ఓపెన్ చేసి దిగువకు నీటిని విడుదల చేశారు. అదేవిధంగా మండలంలోని ప్రాజెక్టులు, చెరువులను గురువారం అధికారుల బృందం పరిశీలించింది. భారీ వర్షాలు కురుస్తుండగా చెరువు, కుంటలలో వరదనీరు వచ్చి చేరుతోంది. ఈ సందర్భంగా తహసీల్దార్ స్వామి, ఎంపీడీఓ సుమతి, ఎంపీఓ మహేష్, ఇరిగేషన్ అధికారులు కొత్తూర్(బి), బూర్దిపాడ్ తదితర గ్రామాల్లోని చెరువులు, నారింజ ప్రాజెక్టును పరిశీలించారు.

◆ రోడ్లపై గుంతలు పూడ్చివేత

నారాయణఖేడ్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఖేడ్ పట్టణంలోని జాతీయ రహదారితో పాటు బైపాస్ రోడ్లపై పలుచోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా గురువారం మున్సిపల్ కార్మికులతో కలిసి గుంతలు పూడ్చివేయించారు. మున్సిపల్ చైర్పర్సన్ రుబీనానజీబ్, శానిటరీ అధికారి శ్రీనివాస్ పనులు పర్యవేక్షించారు.

◆ వంగరి కుంటకు గండి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని అండూర్ గ్రామంలోని వంగరి కుంటకు గురువారం గండి పడింది. రైతుల కోరిక మేరకు ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఈఈ రామస్వామి, ఏఈఈ దిలీప్‌కుమార్, వర్క్ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి చెరువు వద్దకు చేరుకొని రైతులతో కలిసి గండిని పూడ్చివేయించారు.

◆ బీఆర్‌ఎస్‌తోనే తండాల అభివృద్ధి

నారాయణఖేడ్: బీఆర్‌ఎస్‌తోనే తండాల అభివృద్ధి సాధ్యమని మండల పరిధిలోని వాచుతండాకు చెందిన గిరిజనులు అన్నారు. ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని కలిసి తమ తండాకు రూ.1.75కోట్లతో రోడ్డు సౌకర్యం కల్పించారన్నారు. అనంతరం సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

◆ సీసీ కెమెరాల అపహరణ

వట్‌పల్లి(అందోల్): ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని, నేరాల నియంత్రణ, దొంగతనం కేసుల్లో సీసీ కెమెరాలు కీలకమని పోలీసులు చెబుతుంటే ఓ వ్యక్తి సీసీ కెమెరాను ఎత్తుకెళ్లి అందరిని ఆశ్చర్యపరిచిన ఘటన బుధవారం అర్ధరాత్రి వట్‌పల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా ఉండే సాయిరాం జ్యూవెలరీ షాపు వద్ద సీసీ కెమెరాను ఏర్పాటు చేయగా బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి సీసీ కెమెరాను ఎత్తుకెళ్లినట్లు మరో సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఈ విషయమై స్థానిక పోలీసులను వివరణ కోరగా సీసీ కెమెరా చోరీ విషయమై ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ప్రతిఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు.

అన్నివర్గాల సంక్షేమానికి కృషి



మఠం భిక్షపతిని సన్మానిస్తున్న వీరశైవ లింగాయత్ ఉద్యోగుల సంఘం నాయకులు

జహీరాబాద్ టౌన్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ మఠం భిక్షపతి అన్నారు. పట్టణంలోని అతిథి హోటల్‌లో వీరశైవ జంగం సమాజం నాయకులు గురువారం భిక్షపతిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగం, వీరశైవ లింగాయత్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ శెట్టి, ఉపాధ్యక్షుడు శాంతకుమార్, మఠాధిపతులు సిద్దేశ్వర్‌స్వామి, రాచయ్యస్వామి, వీరేశ్వర్ శివాచార్యస్వామి, వీరశైవం జంగం సమాజ్ అధ్యక్షుడు శ్రీనివాస్‌స్వామి, ప్రధాన కార్యదర్శి శరణయ్యస్వామి పాల్గొన్నారు.

జలమయంగా రహదారులు

- సహాయక చర్యల్లో పోలీసులు
- మోటార్ల సహాయంతో నీటి తొలగింపు



మోటార్ల సహాయంతో నీటిని తొలగిస్తున్న పోలీసులు

సాయంతో రామచంద్రాపురం(పటన్‌చెరు): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలుచోట్ల రోడ్లు జలమయంగా మారాయి. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ వద్ద భారీగా వరదనీరు చేరడంతో వాహనదారులు నరకయాతనకు గురవుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. భారీగా చేరిన వర్షం నీటిలో వాహనాలు మొరాయిస్తుండటంతో పోలీసులు, తమ సిబ్బందితో కలిసి మోటార్లతో వర్షం నీటిని తొలగించారు. దీంతో స్థానిక ప్రజలు పోలీసుల సేవలపై అభినందనలు తెలుపుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలని రైతుల వినతి



కంగ్టి(నారాయణఖేడ్): సాగునీటి కాల్వలకు మరమ్మతులు చేపడితేనే పంటలు పండిస్తామని మండల పరిధిలోని దామర్‌గిద్దా, బాన్సువాడ గ్రామానికి చెందిన ప్రజలు ఇరిగేషన్ డీఈఈ విజయ్‌భాస్కర్‌తో గురువారం తమ ఆవేదన వెలుబుచ్చారు. గురువారం దామర్‌గిద్దా కాకివాగు ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు రైతులు గ్రామ పంచాయతీలో డీఈఈకి కాల్వల మరమ్మతులు చేపట్టి సాగునీరు అందించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ ఐదారు ఏళ్ల నుంచి కాల్వకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సాగునీటి కాల్వకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ మైలారం రవి, సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతాలకు తరలింపు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని మల్లన్న బస్తీలో నివాసం ఉండే కిషోర్, శ్రీనివాస్ ఇళ్లల్లోకి వర్షం నీరు చేరుకుంది. దీంతో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, వర్క్ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, సిబ్బంది ఇళ్లలోకి చేరిన నీటిని తొలగింపజేశారు. ఇళ్లు కూడా శిథిలావస్థకు చేరటంతో రెండు కుటుంబ సభ్యులను సురక్షిత ఇళ్లలోకి తరలించారు. అదేవిధంగా జిన్నారం గ్రామానికి చెందిన దానని నర్సింహులు ఇల్లు కూలిపోయేందుకు సిద్ధంగా ఉండటంతో నర్సింహులు కుటుంబాన్ని ఎంపీడీఓ రాములు సురక్షితమైన ఇంటికి తరలించారు.

ఎడతెరిపిలేని వర్షాలతో ఇక్కట్లు



కోహీర్‌లో వర్షానికి కూలిన ఇల్లు

- కూలుతున్న శిథిలావస్థ ఇళ్లు దెబ్బతింటున్న పంటలు
- ముంపునకు గురవుతున్న లోతట్టు ప్రాంతాలు

నారాయణఖేడ్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌లో నాలుగు నివాసాలు పాక్షికంగా కూలాయి. పసుల శ్రీనివాస్, సుందరమ్మ తదితరుల గృహాలు దెబ్బతిన్నాయి. కూలిన నివాసాలను టీఆర్‌ఎస్ నాయకులు అభిషేక్ షెట్కార్ తదితరులు గురువారం పరిశీలించారు. అదేవిధంగా భారీ వర్షాల కారణంగా కాయ దశలోనే టమాటాలు కుళ్లిపోతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వరి చేనులోకి చేరిన వర్షం నీరు

కంగ్టి(నారాయణఖేడ్): వర్షాల కారణంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వరి, సోయా, పెసర, మినుము, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎడతెరిపిలేని వర్షంతో ఇబ్బంది

కోహీర్(జహీరాబాద్): మండలంలో భారీ వర్షం కురిసింది. గడిచిన 24 గంటల్లో 30 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతవరణశాఖ అధికారుల తెలిపారు. భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయై పంట పొలాలు నీట మునిగాయి. మండలంలో ఇప్పటివరకు 9 ఇళ్లు కూలాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలోని పీచేర్యాగడి గ్రామ శివారులో కల్వర్టు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది.

కూలిన ఇల్లు పరిశీలన

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని శెల్గిరా గ్రామానికి చెందిన జగితె నర్సప్పకు చెందిన ఇల్లు వెనుకభాగం గోడ కూలిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న ఎంపీఓ హైమద్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ కూలిన ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యటన

వట్‌పల్లి(అందోల్): మండలంలోని ఖాదిరాబాద్, నాగులపల్లి తదితర గ్రామాలతో పాటు అందోల్ జోగిపేట మున్సిపాల్ పరిధిలోని పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. దీంతో ప్రజలను అప్రమత్తం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీలోని వార్డుల్లో కమిషనర్ తిరుపతయ్య, చైర్మన్ మల్లయ్య, కౌన్సిలర్‌లు చిట్టిబాబు, నాగరాజ్(నాని), రేఖాప్రవీణ్ వేర్వేరుగా పర్యటించారు. బాధితులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు.

టమాటా పంటకు నష్టం



హత్నూర: మొక్కల మధ్యలో చేరిన నీరు

హత్నూర(సంగారెడ్డి): వరుసగా కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలోని బోరుపట్ల గ్రామంలో పలు రైతుల టమాటా పంటలు తిన్నాయి. గ్రామానికి చెందిన రైతు విఠల్ తన కున్న రెండు ఎకరాల్లో టమాటా పంట సాగు చేయగా చేతికొచ్చిన సమయంలో వర్షంతో తీవ్రంగా పంట నష్టం వాటిల్లినట్లు రైతు విఠల్ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.